క్లుప్తంగా

చట్టాలపై అవగాహన ఉండాలి

తాంసి: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే సూచించారు. గురువారం మండలంలోని బండల్‌నాగాపూర్‌లోని మహాత్మా జ్యోతిబాపులే బాలికల గురుకుల విద్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాల చట్టం, బాల కార్మికుల చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది రమేశ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మమత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం అమలు చేయలనే డిమాండ్‌తో ఈనెల 16 నుంచి 31 వరకు నిర్వహించే సంకల్ప రథ యాత్రను విజయవంతం చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర సహాధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌సింగ్ తిలవత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని భీంపూర్ కేజీబీవీని సందర్శించారు. నాణ్యమైన భోజనం వండి పెడుతున్నారా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. కేజీబీవీల్లో చదివేది పేద విద్యార్థులేనని, వారికి మంచి భవిష్యత్ అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట డీఈవో సీసీ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి అండగా ఉంటాం

ఆదిలాబాద్‌టౌన్: బాధిత రైతు కుటుంబానికి అండగా ఉంటామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన కొత్తూర్ ఆశన్న అనే రైతు ఇటీవల మృతి చెందాడు. గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రైతుబీమాకు సంబంధించిన రూ.5లక్షల చెక్కును ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేశ్, రాజు, అష్రఫ్ పాల్గొన్నారు.

ఓసీలకు 'గృహలక్ష్మి' వర్తింపజేయాలి

ఆదిలాబాద్‌టౌన్: అర్హులైన ఓసీలకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు జనగం సంతోశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో గల సంఘ భవనంలో గురువారం జిల్లాస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. భూమిలేని నిరుపేద ఓసీలకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకం మంజూరు చేయాలని కోరారు. ఇందుకోసం త్వరలో జిల్లా కలెక్టర్, మంత్రి ఐకేరెడ్డి, తహసీల్దార్లను కలిసి వినతి పత్రాలు అందజేస్తామన్నారు.

విద్యార్థినులు ధైర్యంగా ముందుకెళ్లాలి



అవగాహన కల్పిస్తున్నషీటీం సభ్యులు

ఉట్నూర్‌రూరల్: విద్యార్థినులు ధైర్యంగా ముందుకెళ్లాలని షీటీం సభ్యులు కమల్, భాగ్యశ్రీలు అన్నారు. గురువారం మండలంలోని దంతన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేయాలన్నారు. పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దళారుల నయా దందా

- రుణాల కోసం బ్యాంకుకు వచ్చే రైతులకు ఎర
- లక్షకు రూ. 3 వేల దాకా వడ్డీ వసూలు
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు



బోథ్: రైతులు బ్యాంకుల్లో రుణాలు తీసుకోవాలంటే పాత రుణాలు చెల్లించాలి. ఈ రుణాలను చెల్లించేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రుణాల చెల్లింపులకు డబ్బులు లేక దళారులను ఆశ్రయిస్తున్నారు. చేతిలో చిల్లిగవ్వలేని రైతులు వ్యాపారస్తులు, దళారులను ఆశ్రయించి మోసపోతున్నారు. రెండు, మూడు రోజుల వ్యవధికే రూ. లక్షకు రూ. 3 వేల వరకు వడ్డీ వసూలు చేస్తూ రైతుల నడ్డీ విరుస్తున్నారు. ఈ తతంగం ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. రైతులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను నిర్దేశిత సమయంలో రీషెడ్యూలు చేయాలి. ఇదే అవకాశంగా దళారులు బ్యాంకుల వద్ద పాగా వేసి సరికొత్త వడ్డీ వ్యాపారానికి తెరలేపారు. బ్యాంకర్లకు ఈదందా గురించి తెలిసినా.. రుణాల లక్ష్యం పూర్తి చేసేందుకు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది అధికారులు దళారులకు పరోక్షంగా సహకరిస్తున్నారు.

రైతుల అవసరాన్ని బట్టి..

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే వర్షాలు కురుస్తుండడంతో సాగు పనులు జోరుగా సాగుతున్నాయి. అన్నదాతలు పెట్టుబడి నిమిత్తం రుణాల కోసం బ్యాంకులకు పరుగులు పెడుతున్నారు. పాత రుణం చెల్లిస్తే రెండు రోజుల్లో కొత్త రుణం మంజూరు చేస్తామని అధికారులు సూచిస్తున్నారు. బ్యాంకుల వద్ద పాగా వేసిన దళారులు పేద రైతులను మచ్చిక చేసుకుని రుణం చెల్లించేందుకు కావాల్సిన డబ్బు సమకూరుస్తున్నారు. రుణం మంజూరయ్యాక రూ. లక్షకు రూ. 3 వేలు, లక్షన్నరకు రూ.4500ల చొప్పున ఇవ్వాలని షరతు విధిస్తున్నారు. చేతిలో చిల్లి గవ్వలేని రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారు.

లోపాయికారి ఒప్పందాలు..

దళారులు బ్యాంకు సిబ్బందితో లోపాయికారి ఒప్పందాలు చేసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రుణాల రీషెడ్యూల్ కోసం వచ్చే రైతుల వివరాలు వారికి చేరవేస్తున్నారు. అప్పు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్న వారి గురించి తెలుసుకుని చెబుతున్నారు. దళారులు నేరుగా ఆయా రైతుల వద్దకు వెళ్లి ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. గత్యంతరం లేని రైతులు దళారులు చెప్పిన వడ్డీ ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు.

పత్రాలు పూరిస్తే రూ.200

రైతులు వారు తీసుకున్న రుణాలకు బ్యాంకులో చెల్లించడానికి సంబంధిత ఫారాలు పూర్తి చేయాలి. బ్యాంకుల్లో రుణాలు చెల్లించడానికి దళారుల వద్ద నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. డబ్బులను బ్యాంకుల్లో చెల్లించాలంటే సంబంధిత పత్రాలను నింపాల్సి ఉంటుంది. దీనికి రూ. 100 నుంచి రూ. 200ల వరకు వసూలు చేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా.. పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దళారులు అందరూ కలిసి రైతులను దోచుకుంటున్నారు.

దళారీ వ్యవస్థ నిర్మూలించాలి



బ్యాంకుల వద్ద ఉంటూ రైతులను దోచుకుంటున్న దళారులపై అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతులకు అధిక వడ్డీలు వేస్తూ వారిని నిలువు దోపిడీ చేస్తున్నారు. వారిపై అధికారులు నిఘా పెట్టాలి. ప్రభుత్వం రుణాలను ఆటో రీ షెడ్యూలు చేయాలి. బ్యాంకుల వద్ద చాలా మంది రైతులు మోసపోతున్నారు. కొంతమంది అధికారులు దళారులకు వత్తాసు పలుకుతున్నారు.

– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

రైతులను అరిగోస పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌ది

- జెడ్పీ ఛైర్మన్ రాథోడ్ జనార్దన్



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నార్నూర్: రైతులను అరిగోస పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దని జెడ్పీ ఛైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. గురువారం గాదిగూడ మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు 3గంటల విద్యుత్ చాలు అంటూ.. వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గతంలో రైతులకు విద్యుత్ ఇవ్వకుండా ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రధాన కారణమైందన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అడ చంద్రకళరాజు, వైస్ ఎంపీపీ యోగేష్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పూసం బాదిరావు, సర్పంచ్ మెస్రం జైవంతరావు, కిరణ్, తుక్కుబాయి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మగూడలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఝరి పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అడే సంజీవ్ అన్నారు. గురువారం గాదిగూడ మండలంలోని ధర్మగూడలో ర్యాపిడ్ ఫీవర్ సర్వేలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్ సెంటర్ పరిధిలోని గ్రామాల్లో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో ఏఎన్ఎంలు శ్రీదేవి, చంద్రకళ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం, వడూర్, ఇందూర్‌పల్లి గ్రామాల్లో భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయసారథి, నిఖిల్ రాజ్ గురువారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో జ్ఞానేశ్వర్, వైద్య సిబ్బంది గంగాధర్, నఫీసా, విష్ణు కుమార్, గోదావరి పాల్గొన్నారు.

పెర్కగూడలో వైద్య శిబిరం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పెర్కగూడలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి అనికేశ్‌రెడ్డి ఆయా గ్రామాల్లో పర్యటించి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని హిందూ శ్మశాన వాటికలో రూ.2 కోట్ల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ గురువారం పరిశీలించారు. వాటర్ ట్యాంక్, ప్రహరీలను పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలకు సమప్రాధాన్యం కల్పిస్తూ ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు. ఆయన వెంట డీఈ తిరుపతి, ఏఈ అరుణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా రోడ్డు



బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామం నుంచి నాగాపూర్ వెళ్లే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. కనీసం నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉంది. నూతన రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. ఇటీవల మొరం వేయడంతో వర్షానికి చిత్తడిగా మారింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

బరంపూర్‌ను మండలంగా ఏర్పాటు చేయాలి

తలమడుగు: మండలంలోని బరంపూర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని మాజీ జెడ్పీటీసీ బాబన్న, సాగర్‌గౌడ్, గ్రామస్తులు గురువారం లక్ష్మీపూర్, దేవాపూర్, పల్లి, పల్సి(కె) గ్రామాల్లో పర్యటించి సంతకాల సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సొనాల గ్రామాన్ని ఏర్పాటు చేసిన విధంగా బరంపూర్‌ను మండలంగా ప్రకటించానలి కోరారు. గ్రామంలో 21 వేల జనాభా ఉందని మండల ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో లింగారెడ్డి, సాగర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బస్ సౌకర్యం కల్పించాలి

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పలు గ్రామాలకు బస్ సౌకర్యం కల్పించాలని యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, దండు మధుకర్ కోరారు. గురువారం ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ విశ్వనాథ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తంతోలి, అంకోలి, లోకారి, వాన్వట్, మామిడిగుడా, పిప్పల్‌ధరి గ్రామాలకు బస్ రావడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వారి భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని బస్ సౌకర్యం కల్పించాలని కోరారు.

యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పోతారెడ్డి

నేరడిగొండ: యువజన కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షుడిగా తేజాపూర్ గ్రామానికి చెందిన బద్దం పోతారెడ్డి నియామకం అయ్యారు. గురువారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్‌లు ఆయనకు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ నాయకుడు అడే గజేందర్, ఆదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి శివ రాథోడ్, సాయిచరణ్ గౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 'అకాడి'



పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇచ్చోడ: అకాడి పండుగను ఆదివాసీ గ్రామాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని బాదిగూడలో సంస్కృతి, సాంప్రదాయాలు ఉట్టిపడేలా అకాడి వేడుకలు నిర్వహించారు. గ్రామ పొలిమేరలోని అటవీ ప్రాంతంలో బాబ్రి చెట్టు వద్ద (రాజుల్) దేవతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడే భోజనాలు చేసి, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపటేల్ సిడాం లక్ష్మీకాంత్, పెందుర్ బండు, పెందుర్ అశోక్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవనాన్ని పూర్తి చేయాలి



హైకోర్టు జడ్జిని కలిసిన సభ్యులు

బోథ్: మండలంలోని జూనియర్ సివిల్ కోర్టు భవనాన్ని త్వరగా నిర్మించాలని హైకోర్టు జడ్జి నవీన్ రావును బోథ్ బార్ అసోసియేషన్ సభ్యులు గురువారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణం త్వరగా జరిగేలా చూడాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వామన్ రావ్ దేశ్‌పాండే, కార్యదర్శి పంద్రం శంకర్, ఉపాధ్యక్షుడు ఠాకూర్ రూపేందర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌పై కుట్రలు చేస్తున్న బీఆర్ఎస్'



రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ కుట్రలు పన్నుతోందని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. స్థానిక బీఆర్ఎస్ నేతలు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడాన్ని ఖండించారు. దీనికి నిరసనగా పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో రేవంత్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అధికారంలో ఉన్నవారు రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడం సిగ్గుచేటని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోశ్, షకీల్, సాత్నాల ప్రాజెక్ట్ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండూరి రవి, ఎంపీటీసీ మనోజ్, మానే శంకర్, రాజ్ మొహమ్మద్, గేడం అశోక్, ప్రభాకర్, షేక్ మన్సూర్, సమి ఉల్లా ఖాన్, వసీమ్ రంజాని, షేక్ సలీం, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

బేల మండలం దుబ్బగూడ, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలో గురువారం వారికి కంది శ్రీనివాసరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను తప్పుబట్టారు. ప్రతి కార్యకర్త కాంగ్రెస్ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంకర్, మన్సూర్, షకీల్, ప్రభాకర్, సంతోశ్ పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్

తలమడుగు: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ డిక్లరేషన్ పత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అమలు చేసే పథకాల గురించి వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా ప్రజలు మోసం చేస్తుందని మండిపడ్డారు. ఇప్పటికీ రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ. 500 గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్ జాదవ్, జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, ఆడె గజేందర్, వన్నెల అశోక్, కమలాకర్, రమేశ్‌రెడ్డి, వెంకన్న, రఘు, గంగారాం, శ్రీనివాసరెడ్డి, ప్రకాష్ రావు, రఫీ, పూర్ణచందర్ పాల్గొన్నారు.

'రైతులను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్'

బోథ్: రుణాలను మాఫీ చేయకుండా సీఎం కేసీఆర్ రైతులను మోసం చేస్తున్నాడని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సల్ల రవి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ వైఎస్సార్‌ను పొగిడారని గుర్తు చేశారు. బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే రైతుల రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని సవాల్ విసిరారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి'



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: వైద్య ఆరోగ్యశాఖలో అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేసి, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలెక్టర్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా కొనసాగుతున్న నరేందర్ రాథోడ్ జిల్లాలో దాదాపుగా 50 నుంచి 60 అక్రమ డిప్యుటేషన్లు చేపట్టారని ఆరోపించారు. వాటికి సంబంధించిన ఆర్డర్ కాపీలను సైతం కలెక్టర్‌కు సమర్పించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జాషువా, ఏఐఎస్ఎఫ్ నాయకుడు తబ్రేజ్‌ఖాన్, మునీర్ పాల్గొన్నారు.

సదస్సు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: కార్మిక సంఘాల సదస్సును జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15న ఆదిలాబాద్ పట్టణంలోని విద్యుత్ తరంగిణి ఫంక్షన్ హాల్‌లో కేంద్ర కార్మిక సంఘాల జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వర్, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, టీఆర్ఎస్‌కేవీ, ఐఎఫ్‌టీయూ నాయకులు కిరణ్, నర్సింగ్, స్వామి, నారాయణ, జగన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో గురువారం ఎంపీపీ తుల శ్రీనివాస్ హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. సొనాలలో 5, గుర్రాలతండాలో 2, గుట్టపక్కతండాలో 2, పార్డి(బి)లో 1, ఘన్‌పూర్‌లో 1, చింతల్‌బోరి, దేవుళ్ నాయక్‌తండా, సంపత్‌నాయక్ తండా, పాచ్పెరలో 1 హెమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల పరిషత్ నిధుల నుంచి రూ.15 లక్షలు వెచ్చించినట్లు పేర్కొన్నారు.

పరామర్శ

గుడిహత్నూర్: మండలంలోని కొల్హారీ గ్రామానికి చెందిన తగ్రే ప్రకాశ్, అమూల్ ముండే ఇటీవల మోటార్ సైకిల్ ప్రమాదానికి గురై గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే గ్రామ పెద్ద సోంటక్కే బాపురావ్ సతీమణి అనారోగ్యంతో మృతి చెందడంతో నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్ గురువారం బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. సర్పంచ్ కల్పనా గజానంద్ గిత్తే, సర్పంచుల సంఘం అధ్యక్షుడు తిరుమల్ గౌడ్, ముండే పాండురంగ్, నర్వడే రమేశ్, జాదవ్ భీంరావ్, సంజీవ్ పాల్గొన్నారు.

బస్‌పాసుల కోసం విరాళం

బోథ్: బోథ్ మండలంలో పేద విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు బస్సుపాస్‌ల కోసం రైల్వేబోర్డు సభ్యులు జీవీ రమణ రూ. 10 వేల నగదును నిర్మల్ ఆర్టీసీ డిపో మేనేజర్ సాయన్నకు గురువారం అందజేశారు. ఈ నగదును పేద విద్యార్థుల కోసం బస్ పాసులను కోసం వినియోగించనున్నారు.

కార్మికులకు రెయిన్ కోట్స్ పంపిణీ

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ సదానంద రెయిన్ కోట్స్ గురువారం పంపిణీ చేశారు. వర్షాకాలంలో తడుస్తూ పనిచేయడం వలన అనారోగ్యాలకు గురయ్యే అవకాశం ఉన్నందున రెయిన్ కోట్స్ అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

బోథ్: బోథ్ మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం ఇంటర్ బైపీసీలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు రీజనల్ కోఆర్డినేటర్ స్వరూపారాణి తెలిపారు. ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

తలమడుగు: మండలంలోని కోడద్ గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో వసుధ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం కృష్ణకుమారి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతీ ఏటా వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు బుక్‌లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుకుమర్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, వదువే విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899